క్లుప్తంగా

'చేయూత' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



వెంకటాపురం(కె): మండల కేంద్రంలో శుక్రవారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ చిడెం యామిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా 20 మంది యువతీ, యువకులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో చేయుత సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్, సాయి తేజ, శెట్టి సునీల్, చిడెం ముత్తయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఎస్ఎస్‌తాడ్వాయి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్యను, బీఆర్ఎస్ యువజన నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, సలేందర్, తాడ్వాయి ఉపసర్పంచ్ ఆలేటి. ఇంద్రసేనారెడ్డి శుక్రవారం పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట నాయకులు పెండ్యాల దశరథం, శ్రీకాంత్, భీమరాజు ఉన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా అధికార ప్రతినిధిగా రమేష్



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన పర్వతాల రమేష్ జాతీయ మానవహక్కుల సంఘం (ఎన్‌హెచ్ఆర్‌సీ) ములుగు జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై ఉన్న నమ్మకంతో ఎన్నికకు సహకరించిన భద్రయ్యకు, రాష్ట్ర నాయకులు పోలోజు రామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు ఫాల్తియా రాజశేఖర్‌లకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

గాలికి విరిగిన ఇన్స్‌లేటర్



వాజేడు: మండల పరిధిలోని కొంగాల వాగు సమీపంలో ఇన్స్‌లేటర్ విరిగి పోయింది. దీంతో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం మధ్యాహ్నం మండలంలో మబ్బులతో గాలి వచ్చింది. ఆ సమయంలో కొంగాల వాగు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం వద్ద ఇన్స్‌లేటర్ విరిగింది. మరికొన్ని చోట్ల లైన్‌పై చెట్లు పడటంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. చెట్లను తొలగించి ఇన్స్‌లేటర్‌ను ఏర్పాటు చేసిన విద్యుత్ సిబ్బంది మూడు గంటల తరువాత సరఫరాను కల్పించారు.

పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛభారత్



ఎస్ఎస్‌తాడ్వాయి: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పోలీస్‌స్టేషన్ ఆవరణలోని పిచ్చిమొక్కలను, చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. స్టేషన్ పరిశుభ్రతగా కన్పించేందుకు పోలీసులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



వాజేడు: మండల పరిధిలోని కోయవీరాపురంలో శుక్రవారం ఎస్సై రేఖ అశోక్, సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసై గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామస్తులు కలిసి కట్టుగా పనులను చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. కొత్తవారికి ఆశ్రయం ఇవ్వవద్దని, అనుమానితులు తారస పడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా పోలీసులకు నేరుగా వచ్చి చెప్పుకోవచ్చని చెప్పారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

- ఏటూరునాగారం సీఐ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజు

ఏటూరునాగారం: విద్యార్థి దశనుంచి క్రమశిక్షణతో ఎదగాలని స్థానిక సీఐ రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందాలన్నారు. పాఠశాల జీవితం ఓ తీపి జ్ఞాపకమన్నారు. పాఠశాల స్థాయిలో నేర్చుకున్న ప్రతి అంశం జీవితంలో ఎంతగానో తోడ్పడతాయన్నారు. విద్యార్థులు తమ విద్యార్థి దశలోనే నైపుణ్యాలను పెంచుకోవాలని చెప్పారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు లక్ష్యాలను ఎంచుకుని అందుకు అనుగుణంగా ఎదిగేందుకు నిరంతరం కష్టపడి చదువుతూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు, ఒడిదుడుకుల గురించి వివరించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లను సీఐ అందించారు. అనంతరం సీఐ, ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో సన్మానించి తమ విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయులతో గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. హెడ్మాస్టర్ సూర్యనారాయణ,రమాదేవి, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీని వాస్, భూమిరెడ్డి, వెంకటరమణ, సారయ్య, పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఎంపీపీ

ములుగు రూరల్(గోవిందరావుపేట): పదో తరగతి పరీక్షల నేపథ్యంలో గోవిందరావుపేట మండలం పస్రా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్‌ను అందించారు. శుక్రవారం పాఠశాల పూర్వ విద్యార్థి కాట్రగడ్డ సతీష్ అందించగా ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషక విలువలపై అవగాహన



వెంకటాపురం(కె): చిరుధాన్యాలు తినడం వల్ల వచ్చే పోషక విలువలపై బాలికలకు అవగాహన సీడీపీఓ ముత్తమ్మ అవగాహన కల్పించారు. మండలంలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమపాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకపక్షం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్పవతి, పంచాయతీ కార్యదర్శి శిరీష, ఉపాధ్యాయులు బాబురావు, పోషన్ అభియాన్ టీమ్ బ్లాక్ కోఆర్డినేటర్ వీరేంద్ర, అంగన్‌వాడీ టీచర్స్ సమ్మక్క, కృష్ణవేణి, యశోద తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



పుస్తకాలను పరిశీలిస్తున్న గ్రంథాలయాల చైర్మన్ గోవింద్‌నాయక్

ఏటూరునాగారం: జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయాల చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలోని పుస్తకాలు, స్టడీ మెటిరీయల్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రూప్స్, కా నిస్టేబుల్స్, ఇతర పోటీ పరీక్షలకు కావాల్సిన స్టడీ మెటీరియల్స్, ప్రత్యేక పుస్తకాలను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ కృషితో ఏటూరునాగారంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రంథాలయం భవనం మరమ్మతు చేయించామన్నారు. వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో నూతన గ్రంథాలయాల భవనాలు, జిల్లా కేంద్రంలో డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మొగుళ్లపల్లి : ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొగుళ్లపల్లి సెంటర్‌లో 115 మంది విద్యార్థులు, మొట్లపల్లి సెంటర్‌లో 146 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. పరీక్ష సమయం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటలకు వరకు నిర్వహించబడునన్నారు. విద్యార్థులు ఒక గంట ముందుగానే సంబంధిత సెంటర్ కి చేరుకోవాలన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, క్యాలిక్యులేటర్స్, సెల్‌ఫోన్స్ తీసుకురాకూడదని, తల్లిదండ్రులు విద్యార్థులను ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా సజావుగా పరీక్ష రాసేటట్టు చూసుకోవాలని ఎంఈఓ పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల సీల్ తెరిచే గదుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 144 సెక్షన్ సంబంధిత రెండు సెంటర్ల పరిధిలో అమలులో ఉంటుందని వారు తెలిపారు.

డాక్టర్ ప్రీతి కేసును సీబీఐకి అప్పగించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాలు

ములుగు: డాక్టర్ ప్రీతి కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. డాక్టర్ ప్రీతి న్యాయపోరాట కమిటీ సభ్యులు ధర్నా చేశారు. ప్రీతి న్యాయపోరాట కమిటీ కన్వీనర్, ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ డాక్టర్ ప్రీతి మృతి చెంది 40 రోజులు గడుస్తున్నా కేసు విచారణలో ఎలాంటి పురోగతి లేకపోవడం బాధాకరన్నారు. కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. ప్రీతి కుటుంబానికి రూ. 5 కోట్ల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబ సభ్యులకు గ్రూప్–1 ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్‌జాతీయ ఉపాధ్యక్షుడు బానోత్ వసంత్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, జిల్లా ఇన్‌చార్జ్ బానోత్ ప్రవీణ్, రాష్ట్ర కార్యదర్శి బానోత్ సునీల్‌కుమార్, అజ్మీర వెంకట్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు పోదెం క్రిష్ణ ప్రసాద్, ఎమ్మార్పీఎస్ నా యకులు జన్ను నర్సయ్య, ఇరుగు పైడి, సేవాలాల్ సేనా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోరిక రాహుల్‌నాయక్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొట్ల కార్తీక్, ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్, దేవానాయక్ పాల్గొన్నారు.

దుక్కిటెద్దు మృతి

పలిమెల : మండలంలోని పంకెన గ్రామానికి చెందిన ఎస్కె సాజిత్‌కు చెందిన దుక్కిటెద్దు విద్యుత్ తీగకు తగిలి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం వంట చెరుకు కోసం అడవికి ఎడ్లబండి కట్టుకొని వెళ్లగా అడవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగను గమనించకుండా వెళ్తుండటంతో ఎద్దుకు విద్యుత్ తాకి అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. విద్యుత్ తీగను అమర్చిన వారి గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరారు.

వ్యవసాయ అభివృద్ధికి కృషి



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న చైర్మన్ మమత

మహాముత్తారం: వ్యవసాయ అభివృద్ధి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ పెండ్యాల మమత అన్నారు. శుక్రవారం మండలంలోని కనుకునూర్‌లో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో అధికారులు ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని చైర్మన్ ప్రారంభించిన అనంతరం ఆయన పశువులకు కావల్సిన పలు రకాల మందులను రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పశుసంపద పెంచడానికి మార్కెట్ కమిటీల ద్వారా పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పశువులకు సీజన్ల వారీగా వచ్చే వ్యాధులు పశువులకు సోకకుండా రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తూ పశువైద్య సిబ్బంది సూచనలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మండలానికి వచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ దంపతులను సింగిల్ విండోచైర్మన్ సోమశాంత కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాదారపు స్వామి, సర్పంచ్ లక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఇనుగొండ రాజిరెడ్డి, ముదురుకోల రవి, పశువైద్యాధికారులు వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని యువతికి గాయాలు

కాటారం: రోడ్డు దాటుతుండగా ఆటో ఢీ కొనడంతో డొంగిరి లక్ష్మి అనే యువతి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. లక్ష్మి శ్రీపాదకాలనీలోని తన సోదరి ఇంటికి వెళ్లి ఇంటికి వస్తోంది. మంథని వైపు గల ప్రధాన రహదారి క్రాస్‌చేస్తుండగా గోపాలపూర్ వైపుగా వెళ్తున్న ఆటో వచ్చి బలంగా ఢీ కొట్టింది. దీంతో ఒక్కసారిగా ఆమె కిందపడిపోవడంతో గాయమైంది. స్థానికులు చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమన్

చిట్యాల : స్థానిక తహసీల్దార్‌గా పి.సుమన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మొగుళ్లపల్లిలో పని చేసిన సుమన్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన సమ్మయ్య మొగుళ్ళపల్లి మండలానికి బదిలీ అయ్యారు. రెండు నెలలు కాకముందే బదిలీ కావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఎల్‌ఓసీ అందజేత

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెంకు చెందిన వావిళ్ల స్వప్నకు చేతికి సంబంధించిన చికిత్స కోసం మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబును కోరగా వైద్య పరీక్షల కోసం ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా రూ. 3 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. శుక్రవారం ఆస్పత్రి సహాయకులు నాగరాజు బాధితురాలికి అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



రవికి ఆర్థికంసాయం చేస్తున్న నారాయణరెడ్డి

మల్హర్: మండలంలోని తాడిచర్లకు చెందిన రవి తల్లి ఇటీవల గుండెపోటుతో మరణించగా వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కాటారం పీఏసీఎస్ చైర్మన్ చల్లా నారాయణరెడ్డి శుక్రవారం పరామర్శించారు. కుటుంబాన్ని ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం రవికి ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు బొంతల రాజు, కాటారం మాజీ జెడ్పీటీసీ దుర్గం మల్లయ్య, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతో అభివృద్ధి

- పీఏసీఎస్ చైర్మన్ శాంతకుమార్

మహాముత్తారం : సంఘం అభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలని సభ్యుల సహకారంతో అభివృద్ధి చేస్తానని పీఏసీఎస్ చైర్మన్ సోమశాంతకుమార్ అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ సోమశాంత కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో గోల్డ్‌లోన్ కొరకు కొంత డబ్బులను వెచ్చించడంతో పాటు గోల్డ్‌లోన్ అప్రైజర్ కొనసాగడానికి మరో రెండేళ్ల పాతవారికే అవకాశం ఇవ్వాలని సమావేశంలో తీర్మాణం చేశారు.అదే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పాతవి కాకుండా మరో రెండు కొత్తవి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్లు, సీఈఓ మార్క శ్రీధర్, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కన్నాయిగూడెం: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, జెడ్పీటీసీ కరన్‌చంద్ గాంధీ, ఎంపీపీ జనగం సమ్మక్క అన్నారు. మండలంలోని ఎంఈఓ నూతన కార్యాలయంలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సీపీఆర్‌పై మెడికల్ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. హఠాత్తుగా గుండె సమస్య వచ్చి రోగి కిందపడిపోతే వారికి సీపీఆర్ చేసి వారి ప్రాణాలను కాపాడవచ్చు. అలాంటి సమయంలో వారికి కొన్నిసార్లు బ్రీతింగ్ అందించాలి. అలాంటి హెల్త్ కార్యక్రమాలు ప్రథమ చికిత్స చేయడంతో గుండెపోటుకు గురైన వారిని రక్షించవచ్చని మెడికల్ అధికారి మౌనిక తలిపారు. ఎంపీపీ సమ్మక్క మాట్లాడుతూ గుండెపోటుకు గురైనప్పుడు రోగికి సీపీఆర్‌తో ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరస్వామి, వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, ఎంపీడీఓ పణిచంద్ర, మెడికల్ అధికారులు అభినవ్, వైద్య సిబ్బంది, సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పరిహారం అందేలా కృషి : ఆర్డీఓ



మిర్చి పంటను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

వెంకటాపురం(ఎం): అకాల వర్షాలతో ఇటీవల పంటలు నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందేలా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని ములుగు ఆర్డీఓ రమాదేవి హామీ ఇచ్చారు. శుక్రవారం అకాల వర్షంతో నష్టపోయిన మిరప పంటలను తహసీల్దార్ మంజులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన రైతాంగాన్ని ఆదుకునేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీపాల్ వ్యవసాయ అధికారిని కళ్యాణి, ఆర్ఐ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం చేయాలి



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిఖిల్‌కుమార్

మంగపేట : సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మగూడెం పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ బాధితులతో పాటు జ్వరం, జలుబు, దగ్గు టీబీ(క్షయ), లెప్రసీ, వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ జైశ్రీ, పీహెచ్‌సీ స్టాఫ్ నర్స్ మౌనిక, ఏఎస్ఎం సీతారావమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న సిద్ధార్థ

ములుగు రూరల్(గోవిందరావుపేట): విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించాలని ఉచితవిద్య, వైద్యం సాధన సమితి జాతీయ అధ్యక్షుడు సిద్ధార్థ అన్నారు. శుక్రవారం గోవిందరావుపేట ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో మాట్లాడారు. నిరుపేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో సాధన సమితి ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్ 05న మెడ్చల్ జిల్లా జవహర్‌నగర్ నుంచి ప్రారంభమైన చైతన్య యాత్ర గోవిందరావుపేటకు చేరుకుందని తెలిపారు. సంక్షేమ హాస్టల్‌లో స్కావెంజర్లు లేక మరుగుదొడ్లు అపరి శుభ్రంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నమిండ్ల కరుణాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం మేనక

మంగపేట : విద్యార్థులు ఇష్టపడి పట్టుదలతో చదివి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని మంగపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం మేనక అన్నారు. స్థానిక పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం హెచ్ఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించాలని ఆశిస్తూ 9వ తరగతి విద్యార్థులు స్వీట్లు తినిపించారు. వార్షిక పరీక్షల్లో స్కూల్ టాపర్‌గా ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ 1,016, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.516 నగదును అందచేస్తామని హెచ్ఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ దీగొండ నర్సింహారావు, ఉపాధ్యాయులు క్రాంతి, నజీమ్‌అక్తర్, శ్రీనివాస్, శివకుమార్, గణేష్, మాధురి, పద్మావతి, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, సతీష్, సాంబశివరావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

- ఎమ్మెల్యే సీతక్క



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ఎస్ఎస్‌తాడ్వాయి: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు స్ఫూర్తిగా, రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ యాత్రకు మద్దతుగా శుక్రవారం మండల పరిధిలోని రంగాపూర్, కొత్తపల్లి, బీరెల్లి, కాటాపూర్, భూపతిపూర్, నర్సాపూర్ గ్రామాల్లో ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన బీఆర్ఎస్ పార్టీని, నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీలను గద్దెదింపాలన్నారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు తగిన న్యాయం జరిగిందన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి అధికారంలోకి తీసుకురావాలని సీతక్క కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొల్లు దేవేందర్, మండల అధ్యక్షులు జాలపు అనంతరెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ ముజఫర్‌హుస్సేన్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, జిల్లా నాయకులు లచ్చుపటేల్, సర్పంచులు మంకిడి నర్సింహస్వామి, రేగ కల్యాణి, ఇర్స అశ్విని, మండల మహిళ అధ్యక్షురాలు కొర్నిబెల్లి నాగమణి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోడి సతీష్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్‌లు ఆశాడపు మల్లయ్య, రమేష్, రవి, సిద్దిరెడ్డి పాల్గొన్నారు.